
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024



చలి గజగజ.. జనం విలవిల

రంగారెడ్డి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఉమ్మడి జిల్లాను చలి గజగజ వణికిస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మూడు రోజులుగా చలిగాలుల తీవ్రత పెరిగి పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 11.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం మౌలాలిలో 13.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

బుగ్గక్షేత్రం.. జనసంద్రం



భక్తులతో కిటకిటలాడుతున్న బుగ్గ రామలింగేశ్వర క్షేత్రం, (ఇన్‌సెట్‌లో) దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మంచాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బుగ్గ రామలింగేశ్వర పుణ్యక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. కుటుంబాలతో కలిసి వేలసంఖ్యలో వచ్చిన భక్తులు ఇక్కడి పుష్కరిణిలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. దీంతో పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

వనభోజనం ఐక్యతారాగం



షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్తీక వన భోజన మహోత్సవంలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) కడ్తాల : మైసిగండి శివ రామాలయాల సన్నిధిలో భోజనాలు చేస్తున్న మహిళలు

షాద్‌నగర్/కడ్తాల్, , నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్‌లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో, కడ్తాల మండలం మైసిగండి శివ రామాలయాల సన్నిధిలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమంలో చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ పాల్గొన్నారు. పచ్చని చెట్ల మధ్య ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. షాద్‌నగర్‌లో పాలమూరు జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు జోషి గోపాల శర్మ వి.రామారావు, రామ సత్యనారాయణ, రవిశర్మ, వీర స్వరూప్, వంగీపురం ప్రవీణ్, మహేష్ శర్మ, ఆమనగల్లులో కరుణశ్రీ కేశవులు వరలక్ష్మీ, లక్ష్మీ, సువర్ణ, దర్శిని, శ్రీదేవి, సరిత పాల్గొన్నారు.

మహిళలు అవాంతరాలను
అధిగమించాలి



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి లావణ్య

శంకర్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఐపీఎస్ అధికారి (సీఐడీ పీసీఆర్ సెల్ హైదరాబాద్) లావణ్య ఆశాభావం వ్యక్తం చేశారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాలలో ఆదివారం ఉమెన్ డెవలప్‌మెంట్, ఆతఃనా క్లబ్ ఆధ్వర్యంలో ఫెమినాక్సెల్ కాన్‌క్లేవ్ 1.0(మహిళా సదస్సు) కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ విజయలక్ష్మితో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారికతకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని సూచించారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ నేడు అంతరిక్షంలో సైతం దూసుకుపోతుందని గుర్తు చేశారు. అవకాశాలను అందిపుచ్చుకుని అవాంతరాలు అధిగమించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇక్ఫాయి రిజిస్ట్రార్ విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజ పురోగతికి మహిళల మద్దతు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సేప్ స్పేస్ ఫౌండర్ అనూష మండవిల్లి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయంతిరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ పద్మావతి, జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రావు, మేనేజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ పూజలు, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రతిష్ఠించే విగ్రహాల ఊరేగింపు, మంగళవారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమై గురువారం విగ్రహ ప్రతిష్ఠాపనలతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయుడు, శివలింగం, నాగదేవతలు, నందీశ్వరుడు, నవగ్రహాలు, ధ్వజస్థంభం ప్రతిష్ఠాపనలు జరుగుతాయని తెలిపారు.



చేవెళ్లలో సేకరించిన పత్తి

కొనుగోళ్ల జోరు

సీసీఐ ఆధ్వర్యంలో ముమ్మరంగా పత్తి సేకరణ

జిల్లాలో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. దళారుల బారిన పడి రైతులు మోసపోకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తిని ముమ్మరంగా సేకరిస్తున్నారు. గత సంవత్సరం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు పత్తిని ప్రైవేట్‌గా విక్రయించి నష్టపోయారు. ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారుల కంటే ప్రభుత్వం అధిక ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తుంది. దీంతో రైతులు పత్తిని సీసీఐకి విక్రయించేందుకే మొగ్గుచూపుతున్నారు.

- తెల్లబంగారంతో నిండిపోయిన జిన్నింగ్ మిల్లులు
- ప్రైవేట్ కంటే ప్రభుత్వ మద్దతు ధర అధికంగా చెల్లింపు
- జిల్లాలో గతేడాది కంటే రెట్టింపు స్థాయిలో విక్రయాలు
- ఏఎంసీకి పెరుగుతున్న ఆదాయం
- 14 కేంద్రాలకు 16,546.06 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ సారి 1,76,174 ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంటను సాగు చేశారు. సాగుకు అనుకూలంగా జిల్లాలో 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా షాద్‌నగర్‌లో 11 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆమగనల్లులో మూడు, చేవెళ్లలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది 1,27,786 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, కొనుగోలు కేంద్రాల్లో

మిగతా 8వ పేజీలో...



ఈనెలలో ఇప్పటి వరకు సేకరించిన పత్తి వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

ఏఎమ్‌సీ	సీసీఐ ద్వారా	ప్రైవేట్ వ్యాపారులు	మొత్తం
షాద్‌నగర్	9,117.80	3,815.74	12,933.54
ఆమనగల్లు	7,373.23	130.51	7,503.74
చేవెళ్ల	55.03	0	55.03
మొత్తం	16,546.06	3,946.25	20,492.31

కులమతాలకు అతీతంగా సేవలు

వాసవీ క్లబ్ అంతర్జాతీయ పాస్ట్ ప్రెసిడెంట్ ఐతా రాములు



వాసవీయన్ల విజయోత్సవంలో మాట్లాడుతున్న ఐతా రాములు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకతీతంగా ప్రపంచ వ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలను అందిస్తున్నట్లు క్లబ్ అంతర్జాతీయ పాస్ట్ ప్రెసిడెంట్ ఐతా రాములు తెలిపారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహ్మగుప్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పద్మావతి కన్వెన్షన్ హాలులో వాసవీయన్ల విజయోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాములు పాల్గొని మాట్లాడారు. విద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వాసవీ క్లబ్ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పాస్ట్ ప్రెసిడెంట్ గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వాసవీ క్లబ్‌లో సభ్యత్వం తీసుకుని సేవలు అందించే వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 2025వ సంవత్సరపు వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా డాక్టర్ సరాపు అనంతం, కార్యదర్శిగా బాదం జగదీశ్వర్, కోశాధికారిగా గంగిశెట్టి నవీన్‌కుమార్‌లను ఎన్నుకుని, వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన 30 వాసవీ క్లబ్‌లకు బహుమతులు అందించి అభినందించారు.

నిరుపయోగం.. నిఘా నేత్రం

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- కేసుల పరిష్కారంలో పోలీసులకు ఇబ్బంది
- మరమ్మతులు చేయాలని స్థానికులు



8

సింహగర్జనను జయప్రదం చేయాలి

- డిసెంబరు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సభ
- మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్



7

ఉపాధి కల్పనకు పెద్దపీట

- అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వం
- ఉత్తరాఖండ్ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సౌరభ్‌బహుగుణ



7

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆమనగల్లులో గద్దర్ కూతురు వెన్నెలకు సన్మానం

వెన్నెలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు , నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్య కార్యక్రమాలలో కవులు, కళాకారులు, గాయకుల పాత్ర కీలకమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమితులైన ప్రజా యుద్ధనౌక గద్దర్ కూతురు వెన్నెలకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తున్న వెన్నెలను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి కసిరెడ్డి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలు, సాహితివేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణశర్మ, బృంగి ఆనంద్ కుమార్, సంజీవ్‌కుమార్, యాదయ్య ఆంజనేయులు, రాములు, సంజీవ, లింగంగౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌రాథోడ్, బాబా, మల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

వృత్తిదారుల సంక్షేమానికి కృషి



- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఇబ్రహీంపట్నం చెరువులోకి చేప పిల్లల విడుదల

చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీపట్నం పెద్ద చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఉచిత చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, చేప పిల్లల పంపిణీలోనూ గత ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకుపోతుందన్నారు. ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకణ పనులను త్వరలో చేపడతామన్నారు. చెరువులో వ్యర్థాలను పారబోయొద్దని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైరర్‌పర్సన్ బర్ల మంగ, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా
మహేశ్వరం?

- ఏర్పాటుకు అధికార పార్టీ నాయకుల ముమ్మర యత్నం
- సీఎంతో ప్రత్యేక జీవోతో ఇప్పించాలని ఒత్తిడి
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే మున్సిపాలిటీగా..
- స్థానిక ఎన్నికలకు దూరం కానున్న 12 గ్రామాలు
- సర్పంచ్ పదవి ఆశావహుల్లో అసంతృప్తి



మహేశ్వరం,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. సిరిగిరిపురం, గంగారం, గంగారంతాండా, మన్‌సాన్‌పల్లి, ఉప్పుగడ్డతంగా, కొత్తతండా, కేసీతండా, డీజీ తండా, ఎన్డీతండా, కేటీతండా, తుమ్మలూరు, మొహబత్‌నగర్ గ్రామాలను కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటుకు అధికార పార్టీ నాయకులు సీఎంపై ఒత్తిడి

మిగతా 8వ పేజీలో...

శిలాఫలకంలో కనిపించని అటవీశాఖ మంత్రి పేరు

జిల్లాలో ఫారెస్ట్ అధికారుల తీరుపై చర్చ



మంత్రి కొండా సురేఖ పేరు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

వికారాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : అనంతగిరి అడవుల్లో చేపట్టనున్న ఫారెస్ట్ అర్బన్ పార్క్ శంకుస్థాపన, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. అయితే శంకుస్థాపన కార్యక్రమంలో సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖ పేరు లేకపోవడం ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. స్పీకర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జిగా మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి పేరు ఉన్నప్పటికీ మంత్రి కొండా సురేఖ పేరు లేక పోవడం ఏమిటని అధికారుల తీరుపై మండి పడుతున్నారు.

సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 11, 12 తేదీలలో జరిగే సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ కోరారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తామన్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజల సమస్యలపై నిర్విరామంగా అనేక ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. చేవెళ్లలో సీపీఎం పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం చేవెళ్ల డివిజన్ కమిటీ కార్యదర్శిగా అల్లిదేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 8 మంది సభ్యులను డివిజన్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమార్, ఎర్రవల్లి శ్రీనివాస్, స్వామిగౌడ్, తేజ, పవన్ కుమార్, జంగయ్య, జుబేర్, మహేశ్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను మరచిన కాంగ్రెస్

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్



కరపత్రం విడుదల చేస్తున్న రుద్రకుమార్

శంషాబాద్, నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఆ సంఘం శంషాబాద్ మున్సిపల్ శాఖ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.25 వేలు, పింఛను రూ.10 వేల చొప్పున చెల్లించాలన్నారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి రేపు ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలసి కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, పవన్‌కుమార్, యాదమ్మ, ఇందిరా ఆర్. రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి ఆ సంఘం నాయకుడు నీరటి మల్లేశ్ అధ్యక్షత వహించారు.

ఐకమత్యం, స్నేహభావానికి క్రీడలు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు. పక్కన మంచాల సీఐ మధు

మంచాల, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఐకమత్యం, స్నేహభావానికి క్రీడా పోటీలు దోహదపడతాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో ఏపీఎల్ క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ యువతీయువకులు డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలని కోరారు. గెలుపోటములను సమస్థాయిలో స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో మంచాల సీఐ మధు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజు, మార బుగ్గరాములు, ఆర్ల శ్రీనివాస్, కె.భాస్కర్, బుట్టి కృష్ణ, వస్పరి కుమార్, వెదిరె సికిందర్‌రెడ్డి, రావుల రాఘవ, సూర్యం, శ్రవణ్, చీమర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కేంద్రం కృషి



చేపల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉత్తరాఖండ్ మంత్రి సౌరభ్ బహుగుణ

కందుకూరు,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాఖండ్ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సౌరబ్ బహుగుణ సూచించారు. మండంలోని గూడూరు గేటు వద్ద అత్యాధునికంగా చేపల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఆదివారం ఆయన కేంద్రాన్ని సందర్శించి చేపల పెంపకపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పెరిగిన చేపలను ఏ మార్కెట్‌లో అమ్మకాలు చేసునే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నట్లు ఆయన గుర్తు చేశారు. బీజేపీ నేతలు సౌరబ్‌బహుగుణకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, నాయకులు నాగేష్, శ్రీరాములు, నర్రరవికుమార్, అభిషేక్, మండల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు భలే డిమాండ్!

- మార్కెట్‌లోకి వస్తున్న కొత్తబియ్యం
- ధాన్యాన్ని బియ్యంగా మార్చి విక్రయిస్తున్న రైతులు
- మిల్లుల వద్దే ఎగబడి కొంటున్న హోల్‌సేల్ వ్యాపారులు
- ఒక్కసారిగా పెరుగుతున్న ధరలు





రైస్‌మిల్లు వద్ద వడ్లు పట్టించటానికి వచ్చిన వాహనాలు

మేడ్చల్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వానాకాలం వరి ధాన్యం ఇప్పుడిప్పుడు మిల్లులకు చేరుకుంటోంది. కొద్ది రోజులుగా రైతులు పంటలను కొసి ఎండబెట్టి వాహనాల్లో రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే కొత్త బియ్యం మార్కెట్‌లో తీసుకొస్తున్నారు. దీంతో కొత్త బియ్యం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. ఒక వైపు ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తున్నా.. మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని మిల్లర్ల వద్ద పట్టించి డిమాండ్‌కు తగ్గట్టుగా మార్కట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో కొత్త బియ్యం కొనుక్కునేందుకు వినియోగదారులు మిల్లుల బాటపడుతున్నారు. వారం రోజులుగా మండలంలోని రైతులు బియ్యం పట్టిచడానికి ధాన్యాన్ని పెద్ద ఎత్తున రైస్‌మిల్లులకు తరలిస్తుండటంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మిల్లులు పని చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

ఆరబెట్టేందుకు అవస్థలు



పొలం వద్ద బండపై ఆరబోసిన సన్న ధాన్యం

మేడ్చల్ మండలంలో బియ్యం పట్టించే రైతులకోసం నాలుగు రైస్‌మిల్లులు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈ రైస్‌మిల్లుల వద్ద కల్లాలు సరిగా లేక పోవడంతో చాలా మంది రైతులు తమ వడ్లు ఎండబెట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చాలా మంది రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద ఉన్న రోడ్డుల పై, మైదానాల్లో వడ్లు ఆరబోసుకున్న అనంతరం రైస్ మిల్లులకు తరలిసున్నారు. మండలంలో దాదాపుగా వరికోతలు పూర్తి కావడంతో రైతులు తమకు అందుబాటులో ఉన్న రైస్‌మిల్లర్ల వద్దకు వెళ్లి వడ్లు పట్టించుకుంటున్నారు.

గంపగుత్తగా కొనుగోళ్లు

సన్నరకంలో కొన్ని బియ్యానికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో వాటిని పండించిన రైతులు రైస్‌మిల్లుల వద్దే అమ్ముకుంటున్నారు. ప్రధానంగా సన్నరకానికి చెందిన చింట్లు, హెచ్‌ఎండీ, శ్రీరామ్ తదితర రకాల బియ్యానికి ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5000-6000 ధర పలుకుతుండటంతో రైతులు వడ్లు పట్టించిన వెంటనే రైస్ మిల్లుల వద్దే విక్రయిస్తున్నారు. కాగా, డిమాండ్ ఉన్న బియ్యాన్ని బియ్యం వ్యాపారస్తులు గంపగుత్తగా పెద్ద ఉత్తన కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. దీనికి తోడు ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహణ, హోటళ్ల నిర్వాహకులు సైతం పెద్ద ఎత్తున బియ్యం కొనుగోలు చేస్తున్నారు.

భూగర్భ మురుగుకాల్వ ప్రారంభం



చౌదరిగూడలో భూగర్భ డ్రైనేజీని ప్రారంభిస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భూగర్భ మురుగుకాల్వను నిర్మించుకోవడం అందరికీ ఆదర్శమని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్ కాలనీ ఫేజ్ 2లో స్థానికులు కలిసి నిర్మించుకున్న డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీయే పనిచేయాలని ఎదురు చూడకుండా స్థానికులే ముందుకు వచ్చి రూ.70వేలు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ గౌడ్, కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, రవీందర్, నవీన్, మనోజ్‌కుమార్, ఆనంద్, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నుకు ఎగనామం!

- రెండేళ్లుగా కొనసాగుతున్న తంతు
- ప్రభుత్వ భూమిలోనే కొనసాగుతున్న క్రషర్
- పట్టించుకోని అంతారం పంచాయతీ అధికారులు





కర్మాగారంలో భారీ వాహనం

తాండూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ క్రషర్ వ్యాపారి పంచాయతీకి చెల్లించాల్సిన ఆస్తిపన్నుకు ఎగనామం పెట్టారు. రెండేళ్లుగా ఇదే తంతుకొనసాగుతున్నా క్రషర్ యజమానిపై చర్యలు తీసుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని అంతారం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమి లావుని పట్టా సర్వే నంబర్-58/3, 58/4లో జరీనా స్టోన్ యజమాని దళితుల నుంచి భూమిని కొనుగోలు చేశాడు. అక్కడే క్రషర్ నిర్మించి పెద్ద ఎత్తున భవన నిర్మాణం కూడా చేపట్టాడు. అయితే వ్యాపారి ఆరు ఎకరాల్లో కర్మాకారం కొనసాగిస్తుండగా, పక్కనే ఉన్న మరో మూడు ఎకరాలపై కన్నేసి ఆ భూమిని కూడా తన ఆధీనంలోకి తీసుకుని వ్యాపారం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గత రెండు రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సర్వేయర్‌తో సర్వే చేయించారు. దీంతో అసలు విషయం బయటపడింది.

రెండు కర్మాగారాల కొనసాగింపు

అంతారం పంచాయతీలో రెండు క్రషర్ స్టోన్ మిషన్లు, భారీ భవనాలు నిర్మించారు. అంతేకాకుండా తప్పుడు పత్రాలతో యజమాని పంచాయతీకి పైసా ఆస్తిపన్ను చెల్లించకుండా ఎగనామం పెడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇతర ప్రాంతాల నుంచి నాపరాతి గుండ్లను భారీ వాహనాల ద్వారా కర్మాగారానికి తీసుకువచ్చి వేగింగ్ చేసిన తర్వాత కర్మాగారంలోకి తీసుకెళ్తారు. వేగింగ్ మిషన్ ఏర్పాటుకు సైతం పంచాయతీ అనుమతి లేకుండానే ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా జరీనా స్టోన్ క్రషర్ పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆ వ్యాపారి ఇష్టారాజ్యంగా పంచాయతీ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కలెక్టర్, పంచాయతీ అధికారి స్పందించి అక్రమాలకు పాల్పడిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



యాత్రికులకు సెండాఫ్ ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఉమ్రా యాత్రకు 50 మంది యాత్రికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఎయిర్‌పోర్టులో వారికి ఘనంగా సెండాఫ్ ఇచ్చారు. అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఫయాజ్ అలీ అధ్వర్యంలో 50 మంది యాత్రికులు ఉమ్రాకు వెళ్లారు. మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ప్రతీ ముస్లిం జీవితంలో ఒక్కసారైన మక్కా, మదీనాలను సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తే జీవితం ధన్యమైనట్లని చెప్పారు. ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆలాగే యూఎస్, కెనడా దేశాలకు చెందిన ముస్లిం సోదరులు అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఈ యాత్రకు వస్తున్నారని ఆయన చెప్పారు. పవిత్ర ప్రార్ధన మందిరాలను సందర్శించడం, ప్రార్ధనాలు చేయడం అదృష్టంగా భావిస్తామని చెప్పారు. ఈ సంస్థ గత 30 ఏళ్ల నుంచి కొనసాగుతోందని చెప్పారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జాయిద్ ఉద్దీన్‌తో పాటు బ్రాంచీ మేనేజర్ జీఎం ఖాన్ ఉన్నారు.



● వ్రత వైభవం

కార్తీకమాసం సందర్భంగా శంకర్‌పల్లిలోని డీఎమ్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పలరాజు మాట్లాడుతూ సామూహిక వ్రతాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. కులాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. 132 మంది దంపతులు ఇక్కడ ఒకే సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం గమనార్హం.

- శంకర్‌పల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి)

రైతుల సంక్షేమానికి పెద్దపీట



శ్రీశైలంను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన వస్పుల శ్రీశైలంనకు ఆదివారం ఆమనగల్లు పట్టణంలో నవయూత్ కాలనీ మైసమ్మ దేవాలయం వద్ద కాలనీ వాసులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైలం ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జానయ్య, బాల్‌రాజ్, అశోక్, కృష్ణ, వస్పుల గిరి, మహేశ్, గిరి, మహేందర్, కొమ్ము నర్సింహ, వగ్గు శ్రీను, పాలె ప్రవీణ్, జగదీశ్, మహేందర్, బాల్‌రామ్, బాబు, వెంకటేశ్, వస్పుల శ్రీకాంత్, శివ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి



శైలజా రామయ్యర్‌ను సన్మానిస్తున్న ఫౌండర్లు

వికారాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా ధ్యానం నేర్చుకోవాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. ఆదివారం కోట్‌పల్లి మండలంలోని క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో నిర్వహించిన బ్రహ్మ జ్ఞాన దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరు ధ్యానం గురించి తెలుసుకోవాలని సూచించారు. క్వాంటం లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్లు డాక్టర్ న్యూటన్, డాక్టర్ లక్ష్మి ఏర్పాటు చేసిన ఈ ధ్యాన కేంద్రం ద్వారా ప్రపంచమే ఇక్కడ వైపు చూసేలా చేశారని కొనియాడారు. డాక్టర్ న్యూటన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో సినీనటి రెజీనా, బీజేపీ నేత విజేందర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, లక్ష్మీన్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం చేసేవరకూ పోరాడతాం

తలకొండపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులుబ అశోక్ గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏదుల జంగయ్య, కృష్ణయ్య, లక్ష్మీపతి, నెహ్రూ, లక్ష్మణ్‌నాయక్, దాసు, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్

మహేశ్వరం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న లక్షలాది మందితో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ కోరారు. ఆదివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో మహేశ్వరం మండల మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో 30 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందనీయకుండా పాలకులు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. మనువాద మందకృష్ణ మాటలు నమ్మి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను అనేక రకాలుగా నిర్లక్ష్యానికి గురి చేశాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేసిన మందకృష్ణ నిజస్వరూపం తెలుసుకోవాలన్నారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి రిజర్వేషన్లు ఎత్తి వేయాలని కుట్రలు చేస్తున్న మంద కృష్ణమాటలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గమనించాలన్నారు. డిసెంబరు 1న జరగబోయే సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహేశ్వరం నియోజకవర్గంలోని మాలలు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు ఏకుల రాములు, రాజేష్, జంగయ్య, ముత్యం, ఉపేందర్, జనార్ధన్, కన్నయ్య శ్రీనివాస్, రాఘవేందర్, ప్రకాష్, గోవర్ధన్ తది తరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

కార్తీక వనభోజనాలతో మంచి ఆరోగ్యం


రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు శేఖర్‌సాగర్



వనభోజన మహోత్సవంలో మాట్లాడుతున్న శేఖర్‌సాగర్

మహేశ్వరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో వన భోజన కార్యక్రమం అన్ని విధాల ఆరోగ్యానికి మంచిదని రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు శేఖర్‌సాగర్ అన్నారు. ఆదివారం జిల్లా సగరసంఘం ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పల్లెల్లో ఈ వన భోజన కార్యక్రమాలు నిర్వహించేవారని హిందూ పురాణాల్లో ఇతిహాసాల్లో కూడా ఈ ప్రస్తావన ఉందన్నారు. సగరులను సంచార జాతిగా గుర్తించి బీసీ- డీ నుంచి బీసీ- ఏలోకి మార్చాలన్నారు. గత ప్రభుత్వాలు కొంత మేరకు హామీలు ఇచ్చినా ఆ హామీలు అమలు కాలేదన్నారు. సగరుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్లో సగరుల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు హరికిషన్, సుధాకర్, సత్యం, సురేష్, శ్రీకాంత్, రవి, పల్లవి, జయమ్మ తధితరులు పాల్గొన్నారు.

రైతులు బీఆర్ఎస్ మాయలో పడొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ప్రాంతంలో వచ్చేది ఫార్మా కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. ఆదివారం వారు బొంరాస్‌పేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్ మాట్లాడుతూ రైతులు బీఆర్ఎస్ నాయకుల మాయలో పడొద్దని కోరారు. రైతులను రెచ్చగొడుతూ అధికారులపై ఉసి గొల్పి కేసీఆర్, కేటీఆర్ పబ్బం గడుపుకుంటున్నట్లు ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టి కొడంగల్ అభివృద్ధి నిరోధకులుగా మారారన్నారు. రైతులు, ప్రజలు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల మున్సిపాలిటీలో దేవుని ఎర్రవల్లిని కలపొద్దు

చేవెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కాబోతున్న చేవెళ్ల మున్సిపాలిటీలో దేవుని ఎర్రవల్లిని విలీనం చేయొద్దని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే యాదయ్యను కోరారు. ఈ మేరకు ఆదివారం దేవునిఎర్రవల్లికి చెందిన నాయకులు సామ రంగారెడ్డి, జంగయ్యగౌడ్. రాజు, శ్రీనివాస్‌గౌడ్, బక్కయ్య తదితరులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలుపొద్దని కోరారు. తాము చేవెళ్ల మున్సిపాలిటీకి వ్యతిరేకం కాదన్నారు. పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుపయోగం.. నిఘా నేత్రం

▸▸ గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు ▸▸ మరమ్మతులకు నోచుకోని వైనం ▸▸ కేసుల పరిష్కారంలో ఖాకీలకు ఇబ్బంది

యాచారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పాడైపోవడంతో నిరుపయోగంగా మారాయి. యాచారం మండల కేంద్రంలో పదేళ్లక్రితం రూ.2లక్షలతో బిగించిన సీసీ కెమెరాలు నేడు పని చేయడం లేదు. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు, నాయకులు వాటిపై శ్రద్ధ తీసుకోలేకపోవడంతో వృథాగా ఉన్నాయి. మాల్, గున్‌గల్ గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఆకుల మైలారం గ్రామంలో రెండేళ్లక్రితం బిగించిన సీసీ కెమెరాలు కూడా పని చేయడం లేదు. ఇటీవల చోరీ జరిగిన తీరు తెలుసుకునేందుకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. అవి పని చేయకపోవడంతో దొంగల జాడ నేటికీ తెలుసుకోలేకపోతున్నారు. ఇదే గ్రామంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళను బెదిరించి మంగళసూత్రం, గాజులు తస్కరించడంతో పోలీసులు గుమ్మడవెల్లి, ఇబ్రహీంపట్నం, కొహెడలో సీసీ కెమెరాలు పరిశీలించడంతో అదే గ్రామంలో నెంబర్‌ప్లేట్ లేని కారు అద్దెకు ఇచ్చిన వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దాంతో దోపిడీ విషయం బట్టబయలైంది. మేడిపల్లిలో సీసీ కెమెరాలు కూడా అస్సలు పని చేయడం లేదు. గున్‌గల్‌లో పలు కెమెరాలు వృథాగా ఉన్నాయి. కుర్మిద్ద, తాటిపర్తి నానక్‌నగర్, కొత్తపల్లి, మల్కీజ్‌గూడ, చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, నజ్దిక్‌సింగారంలో కెమెరాలు అసలే లేవు. కెమెరాలకు మరమ్మతులు చేయాలని, దాతలు చొరవతో కెమెరాలు లేనిచోట ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





యాచారం, ఆకులమైలారంలో పనిచేయని సీసీ కెమెరాలు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంషాబాద్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న శంషాబాద్ పట్టణంలోని కల్లు కాంపౌండ్ వద్ద దాదాపు 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి అచేతన స్థితిలో ఉన్నాడని స్థానికులు రాత్రి 11 గంటలకు పోలీసులకు సమాచారం అందించారు, ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తి నడవలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం 6గంటలకు మృతిచెందాడు. మృతుడు ఎవరనేది ఇప్పటివరకు తెలియడం లేదని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపర్చారని పోలీసులు తెలిపారు. కాగా, మృతిడి ఒంటిపై బ్లూ కలర్ ప్యాంట్ ఉంది, షర్టు లేదు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే ఆర్జీఐఏ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

▸▸ నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

షాద్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని రాయికల్ టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి రాయికల్ టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, ఆర్టీసీ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి గద్వాల జిల్లా ఆత్మకూరుకు బయలు దేరింది. రాత్రి 8గంటల సమయంలో రాయికల్ టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే ముందు వరుసలో మరో వాహనం ఆగి ఉండటంతో బస్సు డ్రైవర్ కూడా బస్సును ఆపారు. ఇంతలోనే వెనకాల నుంచి లారీకి బ్రేక్ పైప్ పగిలిపోవడంతో ముందుగా డివైడర్‌ను ఢీకొని ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో ఢీకొంది. నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో పోలీసులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

▸▸ ఇద్దరికి తీవ్ర గాయాలు



కిషోర్ (ఫైల్)

కొత్తూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో పెంజర్ల రోడ్డుపై శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇరువురు గాయపడ్డారని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. కొత్తూర్‌లో హెయిర్ కటింగ్ సెలూన్ నడుపుతున్న మంగళి కిషోర్(42) రోజూ మాదిరిగానే రాత్రి షాపును మూసి తన ద్విచక్రవాహనంపై కొత్తూర్ తండాలో ఉన్న ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో రోడ్డు వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా వెనుకాల నుంచి అతి వేగంగా నడుపుకుంటూ వచ్చిన మరో బైకిస్టు కిషోర్ బైక్‌ను ఢీకొట్టడంతో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కిషోర్‌ను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. శ్రీకాంత్, సందీప్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

మెడలోంచి మంగళసూత్రం అపహరణ

▸▸ దుండగుడిని పట్టుకొని పోలీసులకు పట్టించిన గ్రామస్తులు

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి మంగళసూత్రం(రోల్డ్‌గోల్డ్) అపహరించి పారిపోతున్న దుండగుడిని గ్రామస్తులు పోలీసులకు పట్టించిన ఘటన ఆదివారం కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంపేటలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన వానరాసి జంగమ్మ, ఆమె భర్త వీరస్వామి, కుమారుడు జగదీశ్వర్‌లు గుమ్మడవెల్లి-బేగంపేట గ్రామాల మధ్య మేకలను మేపుకుంటున్నారు. వీరస్వామి మేకలకు నీరు తాగించడానికి మామిడి తోటలోని బోర్‌బావి వద్దకు తీసుకెళ్లాడు. జగదీశ్వర్ పనిపై బైక్‌పై బేగంపేటకు వెళ్లాడు. జంగమ్మ రోడ్డుపై ఒంటరిగా ఉండడం గమనించిన దుండగుడు ఆమె మెడలో ఉన్న 22 గ్రాముల రోల్డ్ గోల్డ్ మంగళసూత్రం అపహరించి పారిపోయాడు. ఇంతలో వీరస్వామిని పిలిచి జంగమ్మ ఏడుస్తూ విషయం చెప్పింది. వెంటనే వారు జగదీశ్వర్‌కు కాల్ చేసి చెప్పారు. అయితే, ఆ దుండగుడు బేగంపేటలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం

కొత్తూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో కొత్తూర్ తండా వద్ద పెంజర్ల రహదారిపై ఆదివారం సాయంత్రం తుఫాన్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం ప్రకారం.. పెంజర్ల నుంచి కొత్తూర్‌కు వస్తున్న తుఫాన్ వాహనాన్ని డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుకుంటూ రావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఓటరు లిస్టులో తప్పులు సరిచేసుకోవాలి



కేశంపేట : సంగెం పోలింగ్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మీర్ అజంఅలీ

కేశంపేట/కొత్తూర్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఓటరు లిస్టులో తప్పులను సవరించుకునే అవకాశం తెలంగాణ ఎన్నికల సంఘం ఇచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మీర్ అజంఅలీ సూచించారు. ఆదివారం మండలంలోని సంగెం ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సవరణ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు ఓటరు నమోదు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ వెంట డీటీ గీత తదితరులు ఉన్నారు. అదేవిధంగా 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని కొత్తూర్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటర్ నమోదు, సవరణ, తదితర అంశాలపై రెండు రోజులపాటు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు, ఇన్ముల్‌నర్వ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పరిశీలించి, బీఎల్‌వోలకు ప్రత్యేక సూచనలు చేశారు. ఆర్ఐ రాంబాబు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్‌లో ఓటర్ లిస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ. 2.75 కోట్లు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, నవంబరు 24: పట్టణంలోని ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.75 కోట్లు మంజూరు చేసిందని, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పార్లమెంటరీ యువజన సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్‌లు అన్నారు. ఈమేరకు వారు స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా షాద్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి స్టేడియం అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేయడం హర్షణీయమన్నారు. రూ.2.75 కోట్ల నిధులతో స్టేడియం చుట్టూ ప్రహరీ, అథ్లెటిక్ ట్రాక్, వాకర్స్ ట్రాక్‌తో పాటు జిమ్ సౌకర్యం కూడా కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు స్టేడియంలో బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో కబీర్ అహ్మద్, సయ్యద్ ఖదీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లు సమాజ సేవలో ముందుండాలి



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విలువలను స్వీకరించి కేడెట్లు తమ వంతుగా సమాజసేవ చేయాలని రిటైర్డ్ కల్నల్ పీయూష్ శ్రీ వాత్సవ అన్నారు. ఇబ్రహీంపట్నం పరిధి మంగల్‌పల్లి దగ్గర భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, భారత్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మంగల్‌పలి క్రాస్ రోడ్డు వరకు పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. భారత్ విద్యాసంస్థల చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్ గీత



వంశీచంద్ రెడ్డి-అశ్లేషారెడ్డి దంపతులను సన్మానిస్తున్న గీతా నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్పర్సన్‌గా నియమితులైన యాట గీతా నర్సింహ ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వంశీ అశ్లేషారెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మార్కెట్ చైర్‌పర్సన్‌గా తన నియామకానికి సహకరించినందుకు వంశీచంద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వంశీచంద్ చైర్మన్‌గీతా నర్సింహకు సూచించారు. అదేవిధంగా పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలను గీత మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు సన్మానం

ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన గూడూరు భాస్కర్ రెడ్డికి ఆదివారం కడ్తాల మండల కేంద్రంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భాస్కర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. రైతు సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కానుగుల లక్ష్మయ్య, కార్యదర్శి మహేందర్, అంజయ్య, శ్రీనివాస్, మురళి, మహేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



భాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మున్సిపాలిటీగా మహేశ్వరం?

(5వ పేజీ తరువాయి)

తీసుకొస్తున్నారు. ఈ తంతంగమంతా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ముందే పూర్తి చేయాలని చూస్తున్నారు. మహేశ్వరం మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలు, తండాలు కలుపుకొని 2011 లెక్కల ప్రకారం మొత్తం 25వేలకు పైగా జనాభా ఉంటుంది. అయితే మహేశ్వరం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు అవుతుందనే వార్తలు స్థానికుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తుంది. అదే జరిగితే దశాబ్దాలుగా పంచాయతీలుగా ఉన్న పల్లెలు మున్సిపాలిటీ వార్డులుగా మారనున్నాయి. తుక్కుగూడ, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాలను కలుపుకొని తుక్కుగూడ కేంద్రంగా ఐదేళ్ల క్రితం మున్సిపాలిటీగా తయారైంది. ఇదే తరహాలోనే అభివృద్ధిలో వెనుకబడిన మహేశ్వరాన్ని కూడా మున్సిపాలిటీగా మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌పై స్థానిక నాయకులు ఒత్తిడి తెస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్‌తో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మహేశ్వరం ఇంకా గ్రామ పంచాయతీగానే ఉంటే అభివృద్ధి కుంటుపడుతుందనే వాదనలు వినిపిస్తున్నారు.

కొందరి నుంచి వ్యతిరేకత

మహేశ్వరం మున్సిపాలిటీగా ఏర్పాటును కొందరు వ్యతిరేకిస్తున్నారు. పంచాయతీ పాలన దూరమైతే సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని అభిప్రాయపడుతున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల పదవులు ఆశిస్తున్న నాయకులు కూడా అసంతృప్తిగా ఉన్నారు. మహేశ్వరం పరిధి గ్రామాలు మున్సిపాలిటీగా మారితే ఆ పదవులు పొందలేమని, ఇన్ని రోజులు పార్టీల కోసం పని చేసిన తాము ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ప్రతిపాదనలు

మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా మార్చాలనే ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద పెట్టారనే వార్తలు వినిపిస్తున్నాయి. చాలావరకు ఈ ప్రతిపాదనతో ఏకీభవిస్తున్నారని, మున్సిపాలిటీగా మారితే మహేశ్వరం పరిధిలోని ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక జీవో తెచ్చేలా ముఖ్యమంత్రితో చర్చించాలని కేఎల్లార్‌పై స్థానిక నేతలు ఒత్తిడి పెంచుతున్నారు.

చిరుత కాదు.. హైనా

▸▸ విశ్వనాథ్‌పూర్ శివారులో చిరుత కలకలం
▸▸ భయాందోళకు గురైన గ్రామస్థులు
▸▸ హైనాగా గుర్తించిన ఫారెస్ట్ అధికారులు

చౌదరిగూడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం విశ్వనాథ్‌పూర్ శివారులోని వాగు వద్ద ఆదివారం ఉదయం చిరుత పులి సంచరించిందని గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ రేంజర్ రవీందర్ రెడ్డి గ్రామ శివారులోని వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించగా.. వాగులో హైనా పాదముద్రికలు గుర్తించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైనా ప్రజలపై దాడి చేయదని, జంతువులపై మాత్రమే దాడి చేస్తుందని చెప్పారు. గ్రామాల్లోని పశువుల కొట్టాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలు బయటికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టార్చిలైట్లను తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

అంధత్వ నిర్మూలనే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయం

ఆమనగల్లు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శ్రీలక్ష్మీ గార్డెన్‌లో చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరం ఆదివారం 6వ రోజుకు చేరింది. దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 4,200 మందికి కంటి పరీక్షలు చేసి 2,200 మందికి కళ్లద్దాలు అందజేశారు. 120మందికి కంటిశుక్లాలు ఉన్నట్లు గుర్తించి.. 52మందికి ఐఓఎల్ ఆపరేషన్లు చేశారు.

కొనుగోళ్ల జోరు

(5వ పేజీ తరువాయి)

40 వేల మెట్రిక్ టన్నుల పత్తిని సేకరించారు. గత ఏడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 48,388 ఎకరాల విస్తీర్ణంలో సాగు పెరిగింది. వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు 1.05 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అంచనా వేశారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 20492.31 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. అందులో సీసీఐ ద్వారా 16,546.06 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ వ్యాపారులు 3,946.25 మెట్రిక్ టన్నులు సేకరించారు.

వేగంగా చెల్లింపులు

ప్రైవేట్ వ్యాపారులు పత్తి క్వింటాలుకు రూ.6,800 ధర మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం రూ.7,521 మద్దతు ధర అందిస్తుంది. దీంతో రైతులు పత్తిని ఆరబెట్టి నిర్ణీత తేమ శాతంతో తీసుకొచ్చి సీసీఐకి అమ్ముతున్నారు. దీంతో చాలామంది రైతులు మద్దతు ధర పొందుతున్నారు. పత్తి అమ్మిన రైతులకు వేగంగా డబ్బులు చెల్లిస్తున్నారు.

సమస్యలు రాకుండా చర్యలు



రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. దళారులను ఆశ్రయించకుండా నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకోవాలి. ఈ సారి రైతులకు డబ్బుల చెల్లింపుల్లో ఎలాంటి మోసాలు జరగకుండా బ్యాంకు ఖాతాకు, ఫోన్ నెంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేశాం. త్వరగా చెల్లింపులు జరుగుతున్నాయి.

- మహ్మద్ రియాజ్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించా



రెండెకరాల్లో పత్తిని సాగు చేశాను. ఎకరానికి రూ.40 వేల వరకు పెట్టుబడి అయ్యింది. రెండెకరాల్లో 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తిని అమ్మిన. క్వింటాల్ పత్తికి తేమశాతాన్ని బట్టి రూ.7,400 ధర చెల్లించారు. డబ్బులు కూడా వచ్చాయి.

- శ్రీనివాసచారి, కౌకుంట్ల, చేవెళ్ల మండలం

వధూవరులకు స్పీకర్, మంత్రుల ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

షాద్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీప బంధువు కుమార్తె, ఆయన మేనకోడలు సౌమ్య వివాహం ఆదివారం షాద్‌నగర్‌లో కనుల విందుగా జరిగింది. స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అనిరుద్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బక్కని నర్సింహులు, బీశ్వ కిష్టయ్యతో పాటు కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, అగ్గనూరి విశ్వం, అగ్గనూరి బస్వం, శ్యాంసుందర్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న వధూవరులను ఆశీర్వదించారు.

ఆడబిడ్డ వివాహానికి చేయూత



పట్టువస్త్రాలు, నగదు అందజేస్తున్న యాలాల శ్రీనివాస్

కందుకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన శ్యామ్, శాంతమ్మ కూతురు వివాహానికి ఆ గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ పట్టు వస్త్రాలు, రూ.10వేల నగదు సమకూర్చారు. ఆదివారం పెళ్లికూతురు మమతకు శ్రీనివాస్ అందజేశారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎఫ్‌సీఎస్ అవార్డు అందుకున్న మొగులయ్య

చౌదరిగూడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట్ గ్రామానికి చెందిన మొగులయ్యకు ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ(ఎఫ్‌సీఎస్) ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలకు గాను అవార్డు అందజేశారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో వీరన్నపేట్ మత్స్యశాఖ అధ్యక్షుడు మొగులయ్య ఫిషరీష్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నందుకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

సంక్షిప్తంగా

● **తలకొండపల్లి** : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. నాయకులు బక్కి కుమార్, పద్మ అనిల్, పాండు ప్రసాద్, తిరుపతయ్య, మహేశ్, లక్ష్మయ్య, వెంకటేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

● **కడ్తాల్** : ఇప్పటివరకు సర్వే చేయని కుటుంబాలు ఉంటే కలెక్టర్ మరో మూడు రోజులు అవకాశం ఇచ్చారని కడ్తాల ఎంపీడీవో సుజాత తెలిపారు. ఆయా గ్రామాలకు కేటాయించిన ఎన్యూమరేటర్ల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

● **చేవెళ్ల** : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2007-2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు సంబరం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

● **కందుకూరు** : నాలుగేళ్ల క్రితం వరద నీటిలో మృతి చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులకు పరిహారం మంజూరు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బేగంపేటకు చెందిన ఎం.రమేష్‌గౌడ్, బాచుపల్లికి చెందిన పి.రాఘవేందర్‌లు వరద నీటిలో మృతి చెందారని, వారి కుటుంబాలకు పరిహారం మంజూరు చేయకుండా బీఆర్ఎస్ కాలయాపన చేసిందన్నారు. శనివారం ఎమ్మెల్యే సబితారెడ్డి పరిహారం డబ్బులను వారి కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనడం విడ్డూరంగా ఉందన్నారు. మూడు పర్యాయాలు మంత్రిగా కొనసాగిన సబితారెడ్డి నేడు విమర్శించడం మానుకోవాలన్నారు.

● **కందుకూరు** : లగచర్లలో అమాయక ప్రజలపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ, కమిషన్ మాజీ సభ్యుడు, ఆలిండియా బహుజన్ సత్తా అధ్యక్షుడు చిలకమర్రి నర్సింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిరుపేదలు తిరగబడితే అక్రమ కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

● **కేశంపేట** : కొండారెడ్డిపల్లి- చిన్నరేవల్లే వెళ్లే ప్రధాన రహదారికి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు త్రిప్పిశెట్టి సుదర్శన్ సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలుగా మారి రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం గమనించి ఎక్సకవేటర్ సాయంతో మరమ్మతులు చేయించారు. తన అన్న సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిప్పిశెట్టి శంకర్ జ్ఞాపకార్థం పనులు చేయించానని ఆయన వివరించారు.

● **శంషాబాద్ రూరల్** : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చరిత్రలో మొట్టమొదటి సారిగా డిసెంబరు 17 నుంచి 20 వరకు కోల్‌కతాలో ఆల్ ఇండియా ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ జట్టు (హైదరాబాద్ సర్కిల్) ఖోఖో క్రీడాకారులు కోచింగ్ క్యాంపు నిర్వహించారు. గత శనివారం ఆదర్శ విద్యాలయం బుద్వేల్‌లో ఖోఖో శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్‌నాయకుడు, సునంద విజయ్‌కుమార్ ప్రారంభించారు.

● **శంషాబాద్** : తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోనివారు ఈనెల 26వరకు ఎన్యూమరేటర్ వీకే లతకు వివరాలు తెలియజేయాలని ఒక ప్రకటనలో కోరారు. పూర్తి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్ లతను 8074299298 నెంబర్‌లో సంప్రదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మానరేందర్‌రెడ్డి ప్రజలకు తెలియజేశారు.

● **యాచారం** : ద్విచక్రవాహనాదారులు విధిగా హెల్మెట్ ధరించాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. కార్లు నడిపే వారు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఆదివారం కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా మరోమారు పట్టుబడితే ఆర్టీఏ నిబంధనల ప్రకారం కేసులుంటాయని చెప్పారు.

● **యాచారం** : మండలంలోని గ్రామాల్లో కొన్ని రోజులుగా సాగుతున్న సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ మరియు కులసర్వే పత్రాలను ఆదివారం ఆన్‌లైన్‌లో 800 వరకు నమోదు చేశామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇంకా చేయాల్సిన 914 కుటుంబాల సర్వే నేడు(మంగళవారం) పూర్తి చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

● **చౌదరిగూడ** : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో 93 శాతం కుటుంబ సమగ్ర సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. గ్రామాల్లో మిగిలిన వారు ఎవరైనా ఉంటే తక్షణమే ఆయా గ్రామాల్లోని ఎన్యూమరేటర్లను సంప్రదించి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.